# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 12-10-2024** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **విజయదశమి సందర్భంగా దేశ ప్రజలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు.**
2. **పౌర సరఫరాల శాఖ, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖలపై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు సమీక్ష నిర్వహించారు,**
3. **విజయవాడ కనక దుర్గమ్మ అమ్మవారు ఈరోజు రాజరాజేశ్వరీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనం ఇస్తున్నారు**
4. **విజయదశమి సందర్భంగా రాష్ట్రంలోని అన్ని ప్రముఖ దేవాలయాలలో ఈరోజు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.**
5. **బంగాళాఖాతంలో రేపు ఏర్పడనున్న అల్పపీడన ప్రభావంతో రాష్ట్ర వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.**

==========================

విజయదశమి సందర్భంగా దేశ ప్రజలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్రమోదీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగ సత్యం, నైతిక విలువలపై నమ్మకానికి ప్రతీక అని రాష్ట్రపతి సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పేర్కొన్నారు. భగవంతుని ఆశీర్వాదంతో, ప్రజలందరూ అన్ని రంగాలలో విజయం సాధించాలని ఆకాంక్షిస్తున్నానని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సామాజిక మాధ్యమం వేదికగా శుభాకాంక్షలు తెలిపారు.

--------------------------

శరన్నవరాత్రుల చివరి రోజు కావడంతో విజయవాడ ఇంద్రకీలాద్రికి భక్తులు అధిక సంఖ్యలో వస్తున్నారు. ఈ నేపథ్యంలో దసరా మహోత్సవాల ఏర్పాట్లపై తాజా సమాచారం ఆకాశవాణి ఎన్టీఆర్ జిల్లా ప్రతినిధి నవీన్ కుమార్ అందిస్తారు.

(వాయిస్- 23 సెకన్లు)

--------------------------

పౌర సరఫరాల శాఖ, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖలపై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు ఉండవల్లిలోని తన నివాసంలో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షకు మంత్రి నాదెండ్ల మనోహర్, ఆయా

శాఖల ముఖ్య అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణకు పౌర సరఫరాల శాఖ ద్వారా చేపట్టిన చర్యలపై చర్చించారు. ధరల భారం తగ్గించేందుకు ఇప్పటి వరకు తీసుకున్న చర్యలను ముఖ్యమంత్రికి నాదెండ్ల మనోహర్ వివరించారు. డిమాండ్‌కు తగిన విధంగా నిత్యావసర వస్తువుల దిగుమతి, దీర్ఘకాలికంగా చేపట్టాల్సిన చర్యలపై ముఖ్యమంత్రి అధికారులతో చర్చించారు.

---------------------------

శరన్నవారాత్రుల చివరి రోజైన విజయ దశమి సందర్భంగా రాష్ట్రంలోని అన్ని ప్రముఖ ఆలయాలను భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకుంటున్నారు. శ్రీశైల భ్రమరాంబికా అమ్మవారు ఈరోజు సాయంత్రం 6 గంటల 30 నిమిషాలకు నిజరూప అలంకారంలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. అనంతరం స్వామి అమ్మవార్లకు నందివాహన సేవ నిర్వహించనున్నారు. రాత్రి 8 గంటలకు నిర్వహించే తెప్పోత్సవంతో దసరా మహోత్సవాలు ముగియనున్నాయి.

శ్రీకాళహస్తిలోని జ్ఞాన ప్రసూనాంబిక ఆలయానికి తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయానికి చేరుకుంటున్నారు. అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు.

తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో అమ్మవారు మహిషాసుర మర్దిని అవతారంలో భక్తులకు దర్శనమిస్తున్నారు.

పశ్చిమగోదావరి జిల్లా భీమవరం పట్టణంలోని మావుళ్ళమ్మ అమ్మవారు, ఏలూరు జిల్లా నూజివీడు పట్టణంలోని శ్రీ కోట మహిషాసుర మర్దిని అమ్మవారు ఈరోజు శ్రీ రాజరాజేశ్వరి దేవి అలంకారంతో భక్తులకు దర్శనమిచ్చారు.

మరోవైపు విజయనగరంలో జరుగుతున్న పైడితల్లి అమ్మవారి ఉత్సవాలపై సమాచారం మా ఆకాశవాణి విజయనగరం ప్రతినిధి రామకృష్ణ అందిస్తారు.

..వాయిస్..34 సెకన్లు

---------------------------

తిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన ఈ ఉదయం స్వామివారికి చక్రస్నానం నిర్వహించారు. కాగా.. ఈరోజు తెల్లవారుజామున 3 నుండి 6 గంటల వరకు స్వామివారికి పల్లకీ ఉత్సవం 6 నుంచి 9 గంటల వరకు శ్రీవరాహస్వామి ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామివారికి, శ్రీ సుదర్శన చక్రత్తాళ్వార్లకు స్నపనతిరుమంజనం నిర్వహించారు.

---------------------------

ద్వారకాతిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి ఆశ్వయుజ మాస తిరుకల్యాణోత్సవాలను ఈ నెల 13 నుంచి 20 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. వీటిని తిలకించేందుకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్‌విఎస్ఎన్ మూర్తి స్పష్టం పేర్కొన్నారు.

---------------------------

దసరా శరన్నవరాత్రులలో భాగంగా ఈరోజు తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు మండలం, తిమ్మరాజుపాలెం గ్రామంలోని శ్రీ కోట సత్తెమ్మ అమ్మవారిని రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు ఆయనకు స్వాగతం పలికి, ప్రత్యేక పూజలు నిర్వహించి , ఆశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు మంత్రి విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు.

---------------------------

విజయనగరం జిల్లాలోని స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేస్తున్న ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్‌లో గుర్తింపు తీసుకొస్తామని రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. విజయనగరం ఉత్సవాలు, పైడితల్లి పండగ నేపథ్యంలో డీఆర్‌డీఏ, నాబార్డు, ఇతర బ్యాంకుల సహకారంతో ఏర్పాటు చేసిన అఖిల భారత డ్వాక్రా బజార్‌ను కేంద్ర మాజీ మంత్రి అశోక్‌గజపతి రాజుతో కలిసి ఆయన నిన్న ప్రారంభించారు. వివిధ జిల్లాలు, రాష్ట్రాల వారు తయారు చేసిన వస్తువుల ప్రదర్శనలను స్థానిక నాయకులు, అధికారులతో కలిసి సందర్శించారు.

---------------------------

రాష్ట్రంలోని ప్రైమ్ మినిస్టర్స్ స్కూల్స్ ఫర్ రైసింగ్ ఇండియా (పియంశ్రీ) పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ ఇవ్వనున్నారు. మొత్తం 820 స్కూళ్ళలో రెండు విడతలుగా విద్యార్థులకు శిక్షణ ఇచ్చేందుకు పాఠశాల విద్యాశాఖ ప్రణాళిక రూపొందించింది. మొదటి విడత శిక్షణలో భాగంగా 649 స్కూళ్ళలో దసరా సెలవుల అనంతరం ఈ నెల 18వ తేదీ నుంచి ప్రారంభం కానుంది. అనంతరం మిగిలిన 171 పియం శ్రీ స్కూళ్ళలో శిక్షణ అమలు చేయనున్నారు.

---------------------------

కేంద్ర ప్రభుత్వం ఈ నెల 3న ప్రయోగాత్మకంగా ప్రారంభించిన pminternship.mca.gov.in ఇంటర్న్‌షిప్ పోర్టల్ లో అభ్యర్థులు ఈరోజు నుంచి ఈ నెల 25 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని కేంద్ర ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది. ఇంటర్న్ షిప్ కు ఎంపిక అయిన అభ్యర్థులకు 12 నెలల పాటు ప్రతినెల ఐదు వేల రూపాయల ఆర్థిక సహాయం, మరొక ఆరు వేల రూపాయలు ఒక సారి లభిస్తాయి. చమురు, ఇంధనం, ఆతిథ్యం, ఆటోమోటివ్, బ్యాంకింగ్ సహా 24 రంగాలలో అవకాశాలు విస్తరించి ఉన్నట్లు కేంద్ర అధికారవర్గాలు తెలిపాయి.

---------------------------

బంగాళాఖాతంలో రేపు ఏర్పడనున్న అల్పపీడనం 14వ తేదీ నాటికి వాయుగుండంగా, 15 వ తేదీ నాటికి తీవ్ర తుపానుగా మారనుందని భారత వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. దీని ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా 14, 15, 16 తేదీల్లో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం పేర్కొంది.

---------------------------

తమిళనాడులో నిన్న రాత్రి జరిగిన భాగమతి ఎక్స్ ప్రెస్ ప్రమాదం కారణంగా ఆ మార్గంలో నడిచే పలు రైళ్లను దక్షిణ మధ్య రైల్వే రద్దు చేసింది. తిరుపతి–పుదుచ్చేరి మెము, పుదుచ్చేరి–తిరుపతి మెము, డా. ఎంజీఆర్ చెన్నై సెంట్రల్– తిరుపతి ఎక్స్ ప్రెస్ రైళ్లు, తిరుపతి–డా.ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ ఎక్స్ ప్రెస్ రైళ్లు, అరక్కం–పుదుచ్చేరి మెము, కడప–అరక్కోణం మెము, విజయవాడ–డా.ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ పినాకిని ఎక్స్ ప్రెస్, సూళ్లూరుపేట–నెల్లూరు మెము ఎక్స్ ప్రెస్, నెల్లూరు–సూళ్లూరుపేట మెము ఎక్స్ ప్రెస్ రైళ్లు రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు.

---------------------------

ఈరోజు ప్రపంచ కీళ్ళనొప్పుల దినం నిర్వహిస్తున్నారు. ఆర్థరైటిస్ సమస్య గురించి ప్రజలకు అవగాహన కల్పించేవిధంగా ప్రతిసంవత్సరం అక్టోబర్ 12వ తేదీన ప్రపంచ ఆర్థరైటిస్ దినం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా కీళ్ళనొప్పుల బారినపడకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు, ఇప్పటికే ఇబ్బందులు ఎదుర్కొంటున్నవారు చేపట్టవలసిన పరిష్కారాల గురించి తెలియజేస్తూ పలుఅవగాహనా కార్యక్రమాలు ఏర్పాటుచేశారు.

---------------------------

2024-25 ఆర్థిక సంవత్సరానికి ఆదాయపు పన్ను శాఖకు ఇప్పటివరకు 13 లక్షల 57 వేల కోట్ల రూపాయలకుపైగా ప్రత్యక్ష పన్ను వచ్చినట్లు అధికారులు తెలిపారు. వీటిలో ఏడు లక్షల కోట్ల రూపాయలకు పైగా వ్యక్తిగత ఆదాయ పన్ను వసూళ్లు కాగా ఆరు లక్షల కోట్ల రూపాయలకు పైగా కార్పొరేట్ పన్ను వసూళ్లు ఉన్నాయి. మరొక వైపు రెండు లక్షల 31 వేల కోట్ల రూపాయలకు పైగా రీఫండ్‌లను నిన్నటి వరకు జారీ చేయడం జరిగిందని ఆదాయపు పన్ను శాఖ అధికారులు స్పష్టం చేశారు.

======================